క్లుప్తంగా

సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: కార్మికులు విధులకు సకాలంలో హాజరయ్యేలా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 2,9,25 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న చెత్త సేకరణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

క్రీడలపై ఆసక్తిని కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని విద్యార్థులు కలిగి ఉండాలని ఆంధ్ర బెటాలియన్ అధికారి కల్నల్ జె.మహేష్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ విభాగంలో బీ, సీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడల రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండటం అభినందనీయమన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, ఎన్‌సీసీ అధికారి కె.అశోక్ పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణ ప్రణాళిక విభాగంలోని సమస్యలను పరిష్కరించుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరంను నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఇతర సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. పట్టణంలోని భవన నిర్మాణ యజమానులు,లైసెన్స్ సర్వేయర్లు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

ఎస్ఆర్ఎం వర్సిటీకి అవార్డు

మంగళగిరి: వీర సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లా సైనిక సంక్షేమ బోర్డు.. జిల్లాలోని విద్యా సంస్థలు, యూనివర్సిటీల నుంచి నిధుల సేకరణ చేపట్టింది. రూ.1.25 లక్షల నిధుల సేకరణతో నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఈ నెల 7న గుంటూరులో జరిగిన ఫ్లాగ్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి యూనివర్సిటీ అసోషియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణకు అవార్డు అందజేసి, సత్కరించినట్లు యూనివర్సిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు.

కుర్చీలు, వంట సామాన్లు అందజేత



భట్టిప్రోలు: సహృదయ సేవా సంఘం ఆధ్వర్యంలో పాతకమూరి పాపయ్య 25వ వర్ధంతి పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సహకారంతో మంగళవారం భట్టిప్రోలు మండలంలోని పలు హైస్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు, ఆట వస్తువులు, వంట సామాన్లు అందజేశారు. ఈ సందర్భంగా పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 10 కుర్చీలు, చింతమోటులోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువులు, కుర్చీలు, వంట సామాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు ఎస్.రవీంద్రబాబు, నిర్వాహకులు అత్తోట డేవిడ్, రవీంద్రబాబు, వెంకటరత్నం, బి.సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు కేవలం మొక్కుబడి తంతు

- వైఎస్సార్ సీపీ నేతలకు తేల్చిచెప్పిన రైతులు
- తేమశాతం చూడాల్సిన టెక్నీషియన్లూ పత్తా ఉండటం లేదు
- ఆర్ఎస్‌కే పరిధిలో 1200 బస్తాలు మాత్రమే కొన్నారు



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం వద్ద రైతులతో అంబటి రాంబాబు, శివకుమార్

తూములూరు(తెనాలి): ఖరీఫ్ సీజనులో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మొక్కుబడిగానే కొనుగోలు చేస్తోందని మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నేతల పర్యటనలో బహిర్గతమైంది. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశంపై క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల తీరుతెన్నులు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మంగళవారం సాయంత్రం కొల్లిపర మండల గ్రామం తూములూరును సందర్శించారు. పార్టీ తెనాలి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నిమ్మకాయల రాజనారాయణతో కలిసి వచ్చిన మాజీమంత్రి అంబటి, తూములూరు–హనుమాన్‌పాలెం రోడ్డుపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని, గోతాలకు నింపుతున్న కూలీలు, రైతులతో మాట్లాడారు. తూములూరులో కొద్దిరోజులు ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ తర్వాత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవటం లేదని రైతులు చెప్పారు. తేమ శాతం చూసి, కొనుగోలు చేసిన ధాన్యంలో రెండు లారీలను, రైస్‌మిల్లుకు చేరుకున్నాక సంబంధిత మిల్లర్లు తిప్పిపంపారని పార్టీ నేతల దృష్టికి తీసుకొచ్చారు. తేమశాతం చూసే టెక్నీషియన్లు రావటంలేదు. దీనితో కొనుగోళ్లకు తీవ్ర జాప్యం జరుగుతోంది. తేమశాతానికి తీస్తున్న తరుగుదలతో పోల్చుకుంటే మార్కెట్లో వచ్చే రేటు ఒకటే అన్న భావనతోనే దళారులకు విక్రయిస్తున్నట్టు రైతులు చీడేపూడి వెంకటరెడ్డి, మర్రెడ్డి సాంబిరెడ్డి, ఈదా సురేంద్రరెడ్డి, ఈదా హర్షవర్ధన్‌రెడ్డి, మర్రెడ్డి రామిరెడ్డి, కొమ్మారెడ్డి కోటిరెడ్డి నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అక్కడ్నుంచి గ్రామంలోని రైతుసేవా కేంద్రానికి వెళ్లిన నాయకులకు అక్కడా అదే సమాధానం రావటం గమనించాల్సిన అంశం. తమ ధాన్యం కొనుగోలు చేయమని వెళ్లిన రైతుల ధాన్యానికి తేమశాతం చూడాల్సిన టెక్నీషియన్లు పత్తా లేకపోవటం విశేషం! దీనిపై ప్రశ్నించిన రైతులకు రైతుసేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారు. తాము ఫోను చేసినా టెక్నీషియన్లు తీయటం లేదంటున్నారు. అదేవిషయం తమకు లిఖితపూర్వకంగా రాసివ్వమని కోరితే, చేసేదిలేక ఆ విషయాన్నే రాసిస్తున్నారు. ఆ పత్రాలను రైతులు అంబటి రాంబాబు, అన్నాబత్తుని శివకుమార్‌కు అందజేశారు.

రైతుసేవా కేంద్రం పరిధిలో 950 ఎకరాలుంటే, సగటున ఎకరాకు 30 బస్తాల చొప్పున మొత్తం దిగుబడి 28,500 బస్తాల దిగుబడి వచ్చినట్టు. అయితే ఆ కేంద్రం పరిధిలో ఇప్పటివరకు కొనుగోలు చేసింది కేవలం 1200 బస్తాలు మాత్రమేనని సమాచారం ఇచ్చారు. మండల పరిధిలోనూ కొనుగోళ్లు ఈ స్థాయిలోనే ఉన్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో తమను దగా చేస్తోందని రైతులు స్పష్టంగా వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, తూములూరు సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, పార్టీ జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు బొమ్ము శ్రీనివాసరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఉయ్యూరు ఉమామహేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీలు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి, కొల్లి రాఘవరెడ్డి, చంచల రామిరెడ్డి, జొన్నల శివారెడ్డి, భీమవరపు శివకోటి రెడ్డి, గుదిబండి కష్ణ కిషోర్ రెడ్డి, పిల్లి గంగాధర్, బేతాళ భూషణం, పార్టీ తెనాలి నాయకులు కఠారి హరీష్, మల్లెబోయిన రాము, షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, యలవర్తి సాంబశివరావు, అక్కిదాసు కిరణ్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.





చెప్పినా వినడం లేదు!



యంత్రాలతో నేరుగా వరి నూర్పిళ్ల తర్వాత పంటచేలల్లో మిగిలిన వ్యర్థాలను రైతులు తగులబెడుతున్నారు. వ్యవసాయ అధికారులు, పర్యావరణ హితులు ఎంతగా చెబుతున్నా చెవికెక్కటం లేదు. నూరిడి తర్వాత గడ్డిని చుట్టలు చుట్టేస్తున్నారు. చేలో మిగిలిన మోళ్ల తొలగింపునకు బాహుబలి చక్రం తిప్పుతున్నారు. దీనితో మోళ్లు తెగిపోయి, మిగిలిన చెత్తతో సహా పొలం మొత్తం విస్తరిస్తాయి. అప్పుడు నిప్పు పెడుతున్నారు. దీనితో పొగలు విపరీతంగా వస్తున్నాయి. మంగళవారం నియోజకవర్గంలోని చక్రాయపాలెం–దావులూరు మధ్య పంటపొలాల్లో తగులబడుతున్న పంటవ్యర్థాలతో వెలువడుతున్న పొగలు ఇందుకు నిదర్శనం. ఈ పొగలతోనే ఢిల్లీ నగరానికి కాలుష్యభూతం పట్టుకుందని తెలిసినా, రైతులు పట్టించుకోవటంలేదు.

– తెనాలి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఐ కోటేశ్వరరావుతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొల్లిపర: సైబర్ నేరాల పట్ల రైతులు, యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు నుంచి వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని ఎస్ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాల పట్ల అవగాహన వారోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులతో మండల కేంద్రం కొల్లిపరలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమని మీకు లోన్ మంజూరు చేస్తామని, రుణ మాఫీ వస్తుందని కేవైసీ అప్డేట్ చేయాలని మీకు తెలియని లింకులు పంపిస్తే ఓ పెన్ చేయవద్దు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఓటీపీ షేర్ చేయడం, ఆన్‌లైన్ ఉద్యోగాల కోసం వెతకడం, ఆన్‌లైన్ కస్టమర్ కేర్ నంబర్స్ వెతకడం మొబైల్ ఫోన్‌కి వచ్చే అనుమానిత లింక్స్ క్లిక్ చేయగానే మన అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఖాళీ అవుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇటువంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అభివృద్ధికి కృషి



తెనాలిఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి టీటీడీ బోర్డు కృషి చేస్తుందని ఆ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం రాత్రి తెనాలి వచ్చిన ఆయనను బస్టాండ్ సమీపంలోని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికారి ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ కార్యాలయంలో సన్మానించారు. ముందుగా ఆయన సూర్యశిల్ప శాలను పరిశీలించారు. పల్నాడుని పరిపాలించిన అనుగు రాజు విగ్రహ తయారీ బాధ్యతలను శిల్పశాల నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రగుంట మహేష్ బాబు, మలెలబోయిన కొండ యాదవ్, ఈదర రమేష్ బాబు, మేడూరి భాస్కర్, ఈదర అమరేంద్ర కుమార్, కొత్తపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన గాజులవర్తి కోటేశ్వరమ్మ తెలిసిన వాళ్ల దగ్గర అప్పు తీసుకుంది. తీసుకున్న అప్పు కంటే ఎక్కువ చెల్లించానని, అయినా ఇంకా చెల్లించాలని అప్పు ఇచ్చిన వాళ్లు అంటున్నారని వాపోతూ మంగళవారం పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అప్పు చెల్లించకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే సెల్ఫీ వీడియో తీసిందన్న వాదనా వినిపిస్తోంది. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం 14 అర్జీలు, సర్వేకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. దేవదాయ శాఖ ఈవో, సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేరేచర్లలో రెవెన్యూ సదస్సు

మేడికొండూరు: భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దారు హరి బాబు తెలిపారు. పేరేచర్లలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ పరిధిలో అధిక సంఖ్యలో ప్రజలు రెవెన్యూ సదస్సులో పాల్గొని అర్జీలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, పేరేచర్ల ఎంపీటీసీ సురేష్, ఏఎస్ఐ రాజు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాల కోసం వినతి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో లంక భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు, పాస్ బుక్కులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు తహసీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పెదకొండూరు గ్రామంలో రైతులు కొన్ని సంవత్సరాల నుంచి లంక భూములు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. ఆ భూములకు ఇంతవరకు ఏ ఆధారం లేదని, తుఫానులు, వరదలు వచ్చి రైతులు నష్టపోతే వారికి నష్టపరిహారం చెల్లించరని చెప్పారు. వారు పండించిన పంటను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయరని, రైతులకు పాస్ పుస్తకాలు అందజేసి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. డీటీ ఐ. ప్రశాంతి, ఆర్ఐ త్రివేణి, సర్వేయర్ ఎ. గోపాలరావుకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. సాగుదారులు దాసరి విజలక్ష్మి, వెలివెల ధనంజయ్‌రావు, అనిశెట్టి వెంకటేశ్వరరావు, అంకం శేషగిరి రావు, మొలబంటి ఏడుకొండలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు చెక్

తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా

మున్నంగి(కొల్లిపర): రెవెన్యూ సదస్సులలో రైతులు భూ సమస్యలపై అందించిన అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రెవెన్యూ అధికారులు పరిశీలించి 45రోజుల్లోనే శాశ్వత పరిష్కారం అందించటం జరుగుతుందని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా అన్నారు. మంగళవారం మండల పరిధిలోనే మున్నంగి గ్రామంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజాప్రతినిధి సమన్వయం, జవాబుదారీతనంతో పని చేస్తేనే గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ పూర్తిగా ఉచితంగా పొందవచ్చునని, ప్రజలు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 70 శాతానికి పైగా అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. మున్నంగి రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. తొలుత తహసీల్దారు జి.సిద్ధార్థ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా సదస్సులో ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో ఆనంద కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



ఆటోనగర్ వద్ద ధాన్యం ఆరబెట్టిన రైతులతో సాంబిరెడ్డి

తెనాలి: దగా పడుతున్న ధాన్యం రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి విమర్శించారు. తెనాలి రూరల్ మండలంలోని కంచర్లపాలెం, సోమసుందర పాలెం, కఠెవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లకు రైతులు అవసరమైన గోతాల, రవాణా సమస్యలను పరిష్కరించుకోవాలని, తగినన్ని గోతాలను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణ సమయంలో నమోదు చేసిన తేమ శాతానికి, మిల్లర్ల వద్దకు వెళ్లాక తీస్తే తేమ శాతం పెరగటం ఏమిటో రైతులకు అంతుబట్టటం లేదన్నారు. ఈ నెల 12వ తేదీన మళ్లీ తుఫాన్ హెచ్చరికతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయనీ, దీన్ని ఆసరా చేసుకుని 75 కిలోల బస్తాను రూ.1350కే కొనుగోలు చేస్తూ రైతులను దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డులో వెయ్యికి పైగా గోతాలు ఉన్నాగానీ, గ్రామాలకు సరఫరా చేయకపోవటం అన్యాయమన్నారు. రైతులు తరుగుకు సిద్ధంగా ఉన్నా, ధాన్యం ఎత్తే దిక్కు లేకపోవటం దారుణమన్నారు. ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని స్పష్టం చేశారు.

పార్టీలకతీతంగా పంచాయతీల అభివృద్ధి జరగాలి

ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసికట్టుగా ఉండి సరైన ప్రణాళికలతో పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేసి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికరణ (ఎల్ఎస్‌జీడీ) అంశాలపై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, గ్రామ సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శిక్షణకు వచ్చిన సర్పంచ్‌లకు, సిబ్బందికి పంచాయతీ పరిధిలో గ్రామాలు ఏ విధంగా అభివృద్ధి చెందటానికి కావల్సిన ప్రణాళికలు గురించి ఆయా శాఖల మండల స్థాయి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఎంపీడీవో వి.వి జయలక్ష్మి, ఈవోపిఆర్డీ సి.హెచ్.బార్గవ, ఎంపీహెచ్ఓ వి.లక్ష్మి, ఐసీడీఎస్ అధికారి కె.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.సుధాకర్, ఎంపీఎం పి.రమాదేవి, పిడపర్తిపాలెం కార్యదర్శి బి.మాధవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణలు తొలగించండి

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



షిల్ట్ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రోడ్ల వెంట కొందరు ఇంటి యజమానులు ఇసుము, రాళ్లు, ఇతర భవన నిర్మాణ మెటీరియల్‌ను ఏర్పాటు చేసి నెలలు దాటుతున్న ఎందుకు వాటిని తొలగించటం లేదని మున్సిపల్ సిబ్బందిని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. పట్టణంలోని 25వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మురుగు కాల్వలు వ్యర్థాలతో పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. పని తీరులో మార్పు రావాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్ కుమార్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం



పురస్కారంతో శివశంకర్‌కు సత్కారం

తెనాలి: వివిధ సంస్థలను నిర్వహిస్తూ ఎన్నోరకాలసేవలతో సమాజానికి తోడ్పడుతున్న సమాజ సేవకుడు తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం సమంజసమని కాకినాడలోని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా మంగళవారం కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ టీం ఆధ్వర్యంలో అక్కడి 'డి' కన్వెన్షన్ హాలులో సేవాభూషణ్ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. వీరిలో తెనాలికి చెందిన సంఘసేవకుడు తన్నీరు శివశంకర్‌కు సేవారంగం నుండి సేవాభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డపాటి దాసు, ప్రధాన కార్యదర్శి జి.స్వామినాయుడు, జిల్లా కన్వీనర్ గూటూరు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తబిత రత్నకుమారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.